క్లుప్తంగా

పద్మారావునగర్‌లో నేడు ధర్నా

బన్సీలాల్‌పేట్: వంట గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ ఈ నెల 3 (నేడు) పద్మారావునగర్‌లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేయనున్నట్లు ఆ పార్టీ నాయకులు పవన్‌కుమార్ గౌడ్, వెంకటేశన్ ఓ ప్రకటనలో తెలిపారు. పద్మారావునగర్ పార్కు ముందు నిర్వహించే ధర్నాలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలన్నారు.

మహిళా హక్కులపై పోరాడుదాం



మాట్లాడుతున్న ఎస్ఎల్ పద్మ

ఉస్మానియా యూనివర్సిటీ: మహిళా హక్కుల కోసం పోరాడాలని ఐఎఫ్‌టీయూ హైదరాబాద్ అధ్యక్షురాలు ఎస్ఎల్ పద్మ అన్నారు. ఓయూ క్యాంపస్ లేడీస్ హాస్టల్లో గురువారం ఐఎఫ్‌టీయూ, పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో నిర్వహించిన 112వ అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినోత్సవంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో హాస్టల్ డైరెక్టర్ హిమబిందు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత యోగా శిబిరం ప్రారంభం



యోగా శిబిరంలో పాల్గొన్న కార్పొరేటర్ హేమలత

పద్మారావునగర్: సికింద్రాబాద్ పద్మారావునగర్‌లోని ఎస్వీ కాలేజీలో యోగా శిబిరాన్ని గురువారం కార్పొరేటర్ కె. హేమలత, బీఆర్‌ఎస్ నాయకులు పవన్‌కుమార్ గౌడ్, బాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మానసిక ప్రశాంతత, శారీరక ఆరోగ్యానికి యోగా ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. యోగా ద్వారా ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యాన్ని రోగాల నుంచి కాపాడుకోవచ్చన్నారు. ఈ నెల 7వ తేదీ వరకు కొనసాగే శిబిరంలో రోజూ ఉదయం 5.30 నుంచి 7 గంటల వరకు యోగా ఉంటుందని నిర్వాహకులు రోజా పేర్కొన్నారు.

జిమ్‌లకు నిషేధిత ఇంజెక్షన్ల సరఫరా

- పలువురి అరెస్టు

అమీర్‌పేట: జిమ్‌లలో వ్యాయామాలు చేసేందుకు వచ్చే యువకుల కండరాలు పెరిగేందుకు నిషేధిత ఇంజెక్షన్లు, మందులు సరఫరా చేస్తున్న వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సార్ నగర్ సబ్ ఇన్‌స్పెక్టర్ రవిరాజ్ వివరాల ప్రకారం.. జిమ్‌లకు వచ్చే వారికి హానికరమైన ఇంజెక్షన్లతో పాటు మందులను సరఫరా చేస్తున్నారనే సమాచారంతో గురువారం పోలీసులు దాడులు నిర్వహించారు. అమీర్‌పేట మైత్రీవనమ్ నీలగిరి బ్లాక్ షాప్ నెంబర్-107లో సోదాలు చేశారు. సప్లిమెంటరీ ప్రోటీన్ ఉత్పత్తులు విక్రయిస్తున్న వ్యాపారి ఓం ప్రకాష్‌ను అరెస్టు చేసి పలు రకాల నిషేధిత ఇంజెక్షన్లు, మందులను స్వాధీనం చేసుకున్నారు. జిమ్ నిర్వాహకులతో ఒప్పందం కుదుర్చుకుని నిపుణులు, వైద్యుల సిఫారసు లేకుండానే యువకులపై ప్రయోగిస్తున్నారు. నిషేధిత ఉత్పత్తులను జిమ్ నిర్వాహకులకు చేరవేస్తున్న నరేష్, ట్రైనర్ సయ్యద్ ఫారూక్‌ను కూడా అరెస్టు చేశారు.

ఘనంగా ప్రారంభమైన సువార్త సభలు



లాలాపేట: బెత్లెహేమ్ ఎవాంజలికల్ బాప్టిస్టు చర్చి 16వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన మూడ్రోజుల రక్షణ సువార్త మహాసభలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సభలకు జీసస్ హెల్ప్స్ మినిస్ట్రీస్ ఫౌండర్ డైరెక్టర్ బ్రదర్ ఆదాం బెన్నీ, గాస్పల్ సింగర్ బ్రదర్ జడ రమేష్ పాల్ పాల్గొని సందేశాన్ని వినిపించారు. ఈ సందర్భంగా చర్చి క్వయర్ ఆధ్వర్యంలో ఆలపించిన క్రైస్తవ గీతాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కాపరి రెవరెండ్ డా. ఆచార్య ఆహరోన్ తీగుళ్ల, ఏలీషమ్మ, సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఓటు హక్కుకు 1800 దరఖాస్తులు

కంటోన్మెంట్: నూతన ఓటర్ల నమోదుకు తొలి రోజు అనూహ్య స్పందన వచ్చింది. మూడ్రోజుల పాటు కొత్త ఓటర్ల నమోదు కొనసాగనుండగా, తొలిరోజైన గురువారం ఎనిమిది వార్డుల నుంచి 1800కు పైగా దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా ఒకటో వార్డు నుంచి 624 మంది ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నారు. 25 వేలకు పైగా ఓట్లు కోల్పోయిన రెండో వార్డు నుంచి కేవలం 200 దరఖాస్తులు రావడం గమనార్హం. నూతన ఓటర్ల నమోదుకు సంబంధించి ఫామ్-3లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే బోర్డు ఓటరు జాబితాలో ఉన్న ఎవరైనా వ్యక్తి ధ్రువీకరిస్తూ సంతకం చేయాల్సి ఉంటుంది. ఇదిలా ఉండగా కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించి అటు దరఖాస్తు దారులు కానీ.. ప్రతిపాదిత ఓటరు కానీ ప్రత్యక్షంగా రాకుండానే మధ్యవర్తులే మెజారిటీ ఓటు దరఖాస్తులు సమర్పిస్తున్నారు. మూడు రోజుల పాటు అందిన దరఖాస్తులకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలించాకే ఓటరు జాబితాలో చేరుస్తామని బోర్డు అధికారులు పేర్కొంటున్నారు.



ఇందిరానగర్ నుంచి శివాలయానికి వెళ్లే దారిలో కంకర తేలిన రోడ్డు

వారు తవ్వారు.. వీరు అడ్డుకున్నారు!

- అర్థంతరంగా నిలిచిన సీసీ రోడ్డు పనులు
- రెండేళ్ల నుంచి కంకర తేలి ప్రమాదాలకు నిలయంగా మారిన వైనం

లాలాపేట: దాదాపు రెండేళ్ల క్రితం లాలాపేట ఇందిరానగర్ నుంచి శివాలయం వెళ్లే మార్గంలో సీసీ రోడ్డు కోసం జీహెచ్‌ఎంసీ అధికారులు రోడ్డంతా తవ్వారు. ఈ విషయం తెలుసుకుని రైల్వే అధికారులు వచ్చి ఈ రోడ్డు రైల్వే భూమిలో ఉందని రోడ్డు నిర్మాణం చేయరాదంటూ పనులను నిలిపివేశారు. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. అప్పటి నుంచి ఆ మార్గంలో రాకపోకలు సాగించలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

అవగాహన లేమితో తిప్పలు

విలువైన ప్రజాధనం వెచ్చించి చేపట్టే అభివృద్ధి పనుల విషయంలో అధికారుల అవగాహన లేమి స్పష్టంగా కనిపిస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్డు నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసింది మొదలు, ,నిధుల కేటాయింపు, టెండర్ ప్రాసెస్ ఇలా ఇంత పెద్ద వ్యవహారం ఉంటుంది. ఈ వ్యవధిలో రోడ్డు నిర్మాణం ముందుకు సాగుతుందా ఏదైనా అభ్యంతరాలు ఉన్నాయా అని నిర్ధారించుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యం ఫలితంగా దాదాపు రెండు సంవత్సరాల నుంచి కంకర తేలిన రోడ్డుపైనే రాకపోకలు సాగించాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. ఈ నిర్మాణం కోసం స్థానిక ప్రజా ప్రతినిధులు పలుమార్లు రైల్వే అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చింది. చివరకు రైల్వే అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చే సరికి కాంట్రాక్టర్‌కు విధించిన గడువు ముగిసింది. కథ మళ్లీ మొదటికి వచ్చింది. ప్రస్తుతం రీ టెండర్ అంటున్నారు. ఇంతకు రైల్వే అధికారులు రోడ్డు నిర్మాణానికి ఒప్పుకున్నారా లేదా అని స్థానికులు ఆలోచనలో పడ్డారు.



వాహన దారుల ఆగ్రహం

లాలాపేట నుంచి ఇందిరానగర్ మీదుగా ప్రశాంత్‌నగర్ నుంచి మల్కాజిగిరికి వెళ్లేందుకు ఇది దగ్గరి దారి కావడంతో దారి గుండా ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. రెండేళ్ల క్రితం రోడ్డును తవ్వడంతో ఈ దారి గుండా రాకపోకలకు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు అధికారులు చొరవ తీసుకుని త్వరితగతిన సీసీ రోడ్డు నిర్మాణం చేయాలని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు నేతికార్ మహేశ్‌లాల్ కోరారు.

గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహిస్తున్నాం

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



ముగింపు వేడుకల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

రసూల్‌పురా: క్రీడల నిర్వహణపై ప్రధాని మోదీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని ఇందులో భాగంగా గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహిస్తున్నామని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం జింఖానా మైదానంలో నిర్వహించిన ఖేలో ఇండియా ముగింపు వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఖేలో తెలంగాణకు మంచి ఆదరణ లభించిందని గ్రామీణ స్థాయిలో ఎందరో క్రీడాకారులుగా ఎదిగేందుకు ఇలాంటి పోటీలు దోహదపడుతాయన్నారు. హాకీ మాదిరిగానే భారత క్రీడలైన ఖోఖో కబడ్డీలకు కామన్వెల్త్ ఒలింపిక్‌లలో చోటు దక్కేలా క్రీడలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఆయా నియోజకవర్గాల వారీగా విజేతలైన జట్లకు అర్జున అవార్డు గ్రహీత ముఖేష్, కబడ్డీ మాజీ జాతీయ క్రీడాకారిణి నీత్ దడ్వే, తెలంగాణ ఒలింపిక్ కార్యదర్శి జగదీష్ యాదవ్‌తో కలసి ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు జయ ప్రకాష్ నారాయణ, చింతల రాంచంద్రారెడ్డి, నేతలు మురళీధర్ రావు, శ్యాం సుందర్ గౌడ్, కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యులు రామకృష్ణ, కార్పొరేటర్లు కొంతం దీపిక, సరళ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించడం బాధ్యత



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శంకర్ రాజు

సనత్‌నగర్: ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని బేగంపేట ట్రాఫిక్ శిక్షణా సంస్థ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం భద్రతా ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్, కారు డ్రైవింగ్‌లో సీటు బెల్ట్ ధరించాలన్నారు. జీబ్రా క్రాసింగ్ ముందు స్టాప్ లైన్ వద్ద మాత్రమే వాహనాన్ని ఆపాలన్నారు. మద్యం మత్తులో డ్రైవింగ్ చేయరాదని మితిమీరిన వేగంతో వెళ్లరాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్లే అనేక ప్రమాదాలు జరిగి ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం నేరమని, రాంగ్‌రూట్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజిద్‌ఖాన్, ప్రిన్సిపాల్ డాక్టర్ హని షెరాన్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మోడల్‌కాలనీ పార్కు అదుర్స్



సనత్‌నగర్: సనత్‌నగర్ మోడల్ కాలనీ పార్కు హార్టికల్చర్ శాఖ నుంచి రాష్ట్రంలోనే మొదటి బహుమతి దక్కించుకుంది. ఈ శాఖ ఆధ్వర్యంలో 7వ గార్డెన్ ఫెస్టివల్, అర్బన్ ఫార్మింగ్ ఫెస్టివల్‌లో భాగంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ పార్కు ప్రథమ బహుమతి దక్కించుకోవడం గమనార్హం. ఎర్రగడ్డ-ముంబాయి జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న మోడల్ కాలనీ అసోసియేషన్ కొన్ని దశాబ్దాల క్రితమే కాలుష్య నియంత్రణ కోసం ఈ పార్కును అభివృద్ధి పర్చింది. మిగతా పార్కుల కన్నా భిన్నంగా ఎక్కడ చూసినా పచ్చదనం, అందమైన ఆకృతులతో మొక్కలను పెంచారు. అశ్వగంధ, అర్జునా అరిష్టా, రాధామనోహరం, అరటి, ఎర్ర, తెల్ల మందారం, ఎర్రజాజి, మల్లె ఇలా విభిన్న రకాల పుష్పాలు, పండ్లు, ఔషధ మొక్కలతో నిండి ఉంది. వర్షం నీటిని ఒడిసి పట్టేలా ఇంకుడు గుంతలు, మొక్కల ఎరువును సైతం పార్కులోనే తయారు చేసే వర్మీ కంపోస్టు యూనిట్‌ను కూడా ఏర్పాటు చేశారు. గతంలో స్వచ్ఛ అవార్డును కూడా దక్కించుకున్న ఈ పార్కు ఇప్పుడు రాష్ట్రంలోనే మొదటి అవార్డును దక్కించుకోవడం పట్ల అసోసియేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పౌష్టికాహారంతోనే చిన్నారుల్లో ఎదుగుదల



చేతులు శుభ్రం చేసే విధానం చూపిస్తున్న సిబ్బంది

అమీర్‌పేట: చిన్నారుల ఎదుగుదలకు ఐరన్‌తో కూడిన ఆహార పదార్థాలు ఎంతో దోహదపడతాయని వైద్యులు తెలిపారు. ఈఎస్ఐసీ 72వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సనత్‌నగర్ ఈఎస్ఐసీ ఆసుపత్రి ఆవరణలో చిన్నారులకు ఇవ్వాల్సిన పౌష్టికాహారంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.అన్ని రకాల పోషక విలువలతో కూడిన సమతుల్య ఆహారాన్ని పిల్లలకు అందించినప్పుడే వారి ఎదుగుదల బాగుంటుందని వివరించారు. పిల్లలు పరిశుభ్రత అంశాలను ఎలా పాటిస్తున్నారో తల్లిదండ్రులు పరిశీలిస్తూ ఉండాలన్నారు. అనంతరం చేతులు శుభ్రపరుచుకునే విధానంపై చిన్నారులకు ప్రయోగాత్మకంగా చూపించారు.

పీహెచ్‌డీ ఇంటర్వ్యూలు అడ్డుకున్న విద్యార్థుల అరెస్ట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో జరుగుతున్న పీహెచ్‌డీ ఇంటర్వ్యూలను అడ్డుకున్న విద్యార్థులను పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం ఆర్ట్స్ కాలేజీ తెలుగుశాఖలో జరుగుతున్న పీహెచ్‌డీ ఇంటర్వ్యూలను ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు అడ్డుకున్నారు. పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షల అర్హత మార్కుల వివాదం కోర్టులో ఉండగా ఇంటర్వ్యూలు ఎలా నిర్వహిస్తారని డీన్, హెడ్, బీవోఎస్‌లను ప్రశ్నించారు. పెద్ద ఎత్తున నినాదాలతో ఇంటర్వ్యూలు జరగకుండా అడ్డు పడుతుండగా పోలీసులు వచ్చి వారికి అరెస్టు చేసి తీసుకెళ్లారు.

క్రైం కార్నర్..

చోరీలకు పాల్పడుతున్న ముగ్గురి రిమాండ్

రాంగోపాల్‌పేట్: తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు పాత నేరస్తులను గోపాలపురం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్, డీఐ కోటయ్య వివరాల ప్రకారం.. ముషీరాబాద్ భోలక్‌పూర్‌కు చెందిన ఖాజా హుస్సేన్ (22), షమీర్ ముబ్బ (20), గుల్లా అలియాస్ రియాజ్ (23) స్నేహితులు. విలాసాలకు అలవాటు పడిన ముగ్గురు దొంగతనాలకు అలవాటు పడ్డారు. వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి దొంగతనానికి పాల్పడుతారు. గతంలో పలు కేసుల్లో జైలు జీవితం గడిపి వచ్చినా కూడా వీరిలో మార్పు రాలేదు. రెజిమెంటల్‌బజార్‌కు చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి గత నెల 25న గృహ ప్రవేశానికి వెళ్లి తిరిగి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ల్యాప్‌టాప్, టీవీ, బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. అదే రోజు అదే బిల్డింగ్‌లోని మరో ఇంట్లో కూడా దొంగతనం జరిగినట్లు పోలీసులు గుర్తించారు. గురువారం అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురిని డీఎస్సై పాండు ఆధ్వర్యంలో క్రైమ్ సిబ్బంది అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించారు. వారి నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

ఇద్దరు స్నాచర్లకు..

రాంగోపాల్‌పేట్: దొంగిలించిన వాహనాలపై తిరుగుతూ స్నాచింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన అమర్‌జీత్‌సింగ్ (28), సుధీర్‌కుమార్ (30 పుట్‌పాత్‌పై ఉంటూ క్యాటరింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. విలాసాలకు అలవాటు పడిన వారు పార్కింగ్ చేసిన వాహనాలను దొంగిలించి వాటిపై తిరుగుతూ మొబైల్ ఫోన్లు స్నాచింగ్ చేస్తుంటారు. గత నెల 26న ఇద్దరు కలిసి చిలకలగూడ చౌరస్తా, రెజిమెంటల్‌బజార్ ప్రాంతంలో ఇద్దరు వ్యక్తుల నుంచి సెల్‌ఫోన్లు స్నాచింగ్ చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనాలకు పాల్పడుతున్న ఒప్పుకున్నారు.

కంటోన్మెంట్‌లో క్లీన్‌స్వీప్ చేస్తాం

మంత్రి తలసాని



సాయన్న కుమార్తెలతో కలిసి మాట్లాడుతున్న మంత్రి తలసాని

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో త్వరలో జరిగే బోర్డు ఎన్నికల్లో ఎనిమిది స్థానాలూ గెలుచుకుని క్లీన్‌స్వీప్ చేస్తామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. మారేడుపల్లిలోని తన నివాసంలో గురువారం ఆయన దివంగత ఎమ్మెల్యే సాయన్న కుమార్తెలు లాస్య నందిత, నివేదిత, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డితో విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో బీఆర్‌ఎస్ అత్యంత బలీయమైన శక్తిగా ఎదిగిందన్నారు. ముఖ్యంగా బోర్డు ఎన్నికల్లో ఎనిమిది స్థానాలూ కైవలం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజాబలం ఉన్న వారికే పార్టీ మద్దతు లభిస్తుందన్నారు. పార్టీ మద్దతుదారుల విషయంలో ఊహాగానాలను పట్టించుకోవద్దన్నారు. సాయన్న, బీఆర్‌ఎస్ పార్టీ బోర్డు సభ్యుల పోరాటం వల్లే ఇక్కడ అనేక సమస్యలు పరిష్కారం అయ్యాయని గుర్తు చేశారు. నాడు కంటోన్మెంట్‌లో 15 రోజులకోసారి మంచినీటి సరఫరా జరిగేదని ప్రస్తుతం జీహెచ్‌ఎంసీలో మాదిరిగానే ఇక్కడా నీటి సరఫరా జరుగుతోందన్నారు. గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు జూబ్లీ బస్‌స్టేషన్ వద్ద భారీ ధర్నా చేయనున్నట్లు మంత్రి తలసాని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే సాయన్న మృతి పార్టీ, కంటోన్మెంట్ బోర్డు ప్రజలకు తీరని లోటని సాయన్న కుటుంబానికి ప్రభుత్వం, పార్టీ అండగా ఉంటుందన్నారు.

వీధి కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఫీల్డ్ వర్కర్లు

అమీర్‌పేట: చిన్నారులు కుక్కల పట్ల జాగ్రత్తగా ఉండాలని జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ విభాగం ఫీల్డ్ వర్కర్లు సూచించారు. ఇటీవల చిన్నారులు కుక్కకాట్లకు గురవుతున్న నేపథ్యంలో కుక్కలు కరవకుండా తీసుకోవాల్సి జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం అమీర్‌పేట ప్రభుత్వ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంటమాలజీ విభాగం సీనియర్ ఫీల్డ్ వర్కర్ ఆజం పాల్గొని మాట్లాడారు. వీధి కుక్కలను రెచ్చగొట్టే ప్రయత్నం చేయరాదని, వాటిపై రాళ్లు విసరకూడదన్నారు. కుక్కలు వెంబడిస్తే పరిగెత్తరాదన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మధు, ఫీల్డ్ వర్కర్లు హరి, భీమ్ పాల్గొన్నారు.

మైలార్‌గడ్డకు సివరేజీ పైప్‌లైన్ మంజూరు

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ మైలార్‌గడ్డ స్ట్రీట్ నంబరు-1లో నెలకొన్న మురుగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కానుందని, నూతన సివరేజీ పైప్‌లైన్ మంజూరు అయిందని కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. స్థానికుల అభ్యర్థన మేరకు గురువారం ఆమె మైలార్‌గడ్డ ప్రాంతంలో ఆమె పర్యటిస్తూ మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే పనులు చేపడతామన్నారు. వీధి కుక్కల సమస్యను కార్పొరేటర్‌కు వివరించగా ఆమె సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లగా డాగ్ క్యాచర్ బృందాలను పంపించారు. ప్రజా సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ హేమ

అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరిక



జైప్రకాష్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న దృశ్యం

రసూల్‌పురా: సీఎం కేసీఆర్ నాయకత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జై ప్రకాష్ అన్నారు. గురువారం జైప్రకాష్ సమక్షంలో పలువురు బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఆదివారం బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు భారీ ఎత్తున పార్టీలో చేరుతున్నారన్నారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి, పేద ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గమనించి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాజేష్, హరిష్, సందీప్, విజయ్, లింగం, భానుచందర్, సూరి, రాహుల్, నరేందర్, చింటూ, మహేష్ యాదవ్, మనోజ్, పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న ముప్పిడి రేవతి

జోరందుకుంటున్న ప్రచారం

రసూల్‌పురా: దివంగత ఎమ్మెల్యే సాయన్న కుటుంబ ఆశీస్సులతో మూడో వార్డు బీఆర్‌ఎస్ తరఫున బరిలో ఉంటున్నట్లు ముప్పిడి రేవతి నరేష్ తెలిపారు. గురువారం ఆమె అంబేడ్కర్ సొసైటీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ మాట్లాడారు. బస్తీలో అనేక సమస్యలున్నాయని ముఖ్యంగా మహిళలు మంచి నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. 2015 జనవరిలో జరిగిన బోర్డు పాలకమండలి ఎన్నికల్లో ఇదే మూడవ వార్డు నుంచి పోటీ చేశానని గుర్తు చేశారు. మంత్రి తలసాని శ్రీనివాస్ మర్రి రాజశేఖర్‌రెడ్డికు పార్టీ తరఫున మద్దతు కోసం అర్జీ పెట్టుకున్నామన్నారు. సాయన్న కుటుంబ సభ్యుల ఆశీస్సులు పొందానని, పార్టీ మద్దతు ఉన్నా లేకున్నా ఎన్నికల బరిలో దిగుతామన్నారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ నగర్ సొసైటీ అధ్యక్షులు నర్సింగ్ రావు, ప్రధాన కార్యదర్శి పరమేష్, విజయ్, ఫణిందర్, నర్సమ్మ, యాదమ్మ, రేణుక, జయమ్మ, సమీరా బేగం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగినేని సరిత

కార్యకర్తల మద్దతుతో బరిలోకి..

రసూల్‌పురా: పదవి లేకుండానే ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ దివంగత ఎమ్మెల్యే సహకారంతో కోట్లాది రూపాయలతో పలు అభివద్ధి పనులు ఏడవ వార్డు పరిధిలో చేపట్టానని బీఆర్‌ఎస్ ఏడవ వార్డు మహిళ అధ్యక్షురాలు నాగినేని సరిత అన్నారు. గురువారం శాస్త్రీనగర్ పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. ఈసారి జరిగే బోర్డు పాలకమండలి ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ మద్దతు ఉన్నా లేకున్నా ప్రజల కార్యకర్తల మద్దతుతో బరిలో దిగుతానన్నారు. 15 ఏళ్లుగా కంటోన్మెంట్ జాగృతి కన్వీనర్, వార్డు మహిళ అధ్యక్షురాలిగా కొనసాగుతున్నానని చిన్నకమేళా, లాలామీయా బస్తీ, 200 గల్లీ, శాస్త్రీనగర్ ఇతర బస్తీల్లో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పైపులైను పనులు గన్‌రాక్ కాలనీలో పార్కు అభివృద్ధి పనులు చేశానని గుర్తు చేశారు. మంత్రి తలసాని మర్రి రాజశేఖర్‌రెడ్డి అండదండలతో ఎన్నికల్లో ఉంటానన్నారు. వివిధ కాలనీ, బస్తీల అధ్యక్షులు నాయకులు నాగేందర్,రాము సుందర్, కుర్మయ్య. సుధాకర్, శింద్ర, సుబ్రహ్మణ్యం. సందీప్ పాల్గొన్నారు

బండపై భగ్గు!

గ్యాస్ ధరల పెంపుపై ధర్నాలు, రాస్తారోకోలు

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ పలు పార్టీల ఆధ్వర్యంలో గురువారం ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. ఎంజీ రోడ్డులోని గాంధీ విగ్రహం ముందు నిర్వహించిన ధర్నాలో మంత్రి తలసాని పాల్గొన్నారు. రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె కృశాంక్ ఆధ్వర్యంలో తాడ్‌బంద్ చౌరస్తాలో, బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్ ఆధ్వర్యంలో డైమండ్ పాయింట్ చౌరస్తాలో ధర్నాలు నిర్వహించారు. రోడ్డుపై వంటావార్పు చేపట్టారు. రెజిమెంటల్‌బజార్‌లోని హెచ్‌పీ గ్యాస్ కార్యాలయం ముందు టీడీపీ నాయకులు ఖాళీ సిలిండ్‌తో నిరసన తెలిపారు. -రాంగోపాల్‌పేట్/కంటోన్మెంట్



వంటావార్పులో పాల్గొన్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



తాడ్‌బంద్ చౌరస్తాలో కృశాంక్ ఆధ్వర్యంలో ధర్నా



డైమండ్ పాయింట్ చౌరస్తాలో నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న గజ్జెల



గ్యాస్ ధరలు తగ్గించాలని ఆందోళన చేస్తున్న టీడీపీ నాయకులు